రాలుతున్న మామిడి పూత

ఈ ఏడాది వాతావరణంలో వస్తున్న మార్పులు మామిడి పంటపై అధిక ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా పొగమంచు ఎక్కువగా కురుస్తుండడంతో పూత రాలిపోతోంది. దీంతో దిగుబడి తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చే అవకాశం కూడా లేదని, అప్పులపాలు అవ్వాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు.



- వాతావరణంలో మార్పులతోనేనంటున్న అధికారులు
- ఈ ఏడాది దిగుబడి తగ్గుతుందని రైతుల ఆందోళన

నారాయణవనం: సాధారణ పంటల సాగు భారంగా మారుతుండడంతో రైతులు మామిడి తోటల పెంపకంపై దృష్టి సారిస్తున్నారు. నారాయణవనం మండలంలో 525 హెక్టార్లలో మామిడిని సాగుచేస్తున్నారు. గత ఏడాది ఆశించిన స్థాయిలో పూత లేక పంట దిగుబడి అంతంత మాత్రంగానే వచ్చింది. దీనికితోగు కాయలకు గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. ఈ ఏడాది సమయానికి చెట్టునిండా పూత వచ్చింది. దీంతో రైతులు సంబరపడ్డారు. దిగుబడి బాగా వచ్చి చేసిన అప్పులు తీర్చుకోవచ్చని అనుకున్నారు. వాతావరణంలో వచ్చిన మార్పులు వారి ఆశలపై నీళ్లు చల్లాయి. ఉదయం పది గంటల వరకు పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో పూత రాలిపోతోంది. వున్న అరకొర పూతకు సైతం ఆంత్రాక్నోస్ తెగులు ఆశించడంతో మగ్గిపోయి రాలిపోతోంది. అంతేగాక రసం పీల్చు పురుగు, గొంగళి పురుగులు విజృంభిస్తున్నాయి. అలాగే బూడిద తెగులు ఆశిస్తోంది. దీంతో పంట దెబ్బతింటోందని రైతులు వాపోతున్నారు.

- ఉద్యానవన అధికారులు మామిడి తోటలను పరిశీలించి రైతులకు సలహాలు ఇస్తున్నారు. నిద్రావస్థలో ఉన్న పూత మొగ్గగా బయటకు రావడానికి 13:0:45 (మల్టీ-కె) 10 గ్రాములు, ఫార్ములా-4 రెండు గ్రాములు, క్లోరోపైరిఫాస్ 50శాతం ఈసీ 2 మిల్లీలీటర్ల చెప్పున మిశ్రమాన్ని కలిపి చెట్టు అంతా మంచులా పడేలా పిచికారీ చేయాలని సూచిస్తున్నారు.
- పచ్చి పూత దశలో ఉన్నప్పుడు, పిందె కట్టే శాతాన్ని పెంచుకోవడానికి బుప్రోఫెజిన్ 20 శాతం, ఎసిపేట్ 50 శాతం కాంబినేషన్‌లో ఉండే పురుగు మందు 1 గ్రాము, మాంకోజేబ్ 63 శాతం, కార్బెండజిం 12 శాతం కాంబినేషన్‌లో ఉండే మందును 1.5 గ్రాములు, ఫార్మలా-4 రెండు గ్రాములు, గమ్ము 0.5 మిల్లీలీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తద్వారా రసం పీల్చే పురుగులు, ఆంత్రాక్నోస్ తెగులు నుంచి పంటలను రక్షించుకోవచ్చు.
- మామిడి పిందెలు బఠానీ గింజ పరిమాణంలో ఉన్నపుడు డైనోటేఫురాన్ 20 శాతం, ఎస్‌జీ 0.6 గ్రాములు లేదా స్పైనోసాడ్ 45 శాతం ఎస్‌సీ 0.3 మిల్లీలీటర్ల పురుగు మందు, అజాక్సిస్ట్రోబిన్ 23 శాతం ఎస్‌సీ 1 మిల్లీలీటర్లు లేదా కాపర్ ఆక్సీ క్లోరైడ్ 50 శాతం డబ్ల్యూపీ 3 గ్రాముల మందు, బోరాన్ 1 గ్రాము, గమ్ 0.5 మిల్లీలీటర్ల చొప్పున లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- మామిడిలో బూడిద తెగులు గమనించినప్పుడు హెక్సాకొనజోల్ 5 శాతం ఎస్‌సీ 2 మిల్లీలీటర్లు లేదా మైక్లోబ్యుటనిల్ 10 శాతం డబ్ల్యూపీ 10 గ్రాములు, పూత, పిందె దశలో గొంగళి పురుగు ఆశించినప్పుడు ఎమామిక్టిన్ బెంజోయేట్ 5 శాతం డబ్ల్యూజీ 0.5 మిల్లీ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి.
- పూత మొగ్గగా ఉండి విచ్చుకునే దశల్లో మామిడికి నీరు పెట్టకూడదు. పిందె బఠానీ గింజ పరిమాణంలోకి వచ్చిన తర్వాతే నీరు పెట్టాలి.

సూచనలు పాటించండి



పగటి పూట కూడా మంచు ఎక్కువగా కురుస్తోంది. పూత మొగ్గతొడగముందే రాలిపోతోంది. తెగులు, చీడలు ఆశిస్తే పూత పూర్తిగా రాలిపోయే ప్రమాదం ఉంది. రైతులు రైతు సేవా కేంద్రాల సిబ్బందిని సంప్రదించి సమయానికి మందులు పిచికారీ చేయించాలి. పూత, మొగ్గ తొడిగే దశలో మామిడి చెట్లకు నీరు పెట్టకపోవడం మంచిది. పిందె దశలోకి వచ్చిన తర్వాతే నీరు పెట్టాలి.

– సౌజన్య, ఉద్యానవనశాఖ అధికారి, పుత్తూరు క్లస్టర్

క్లుప్తంగా

వైభవంగా కుంభాభిషేకం



కుంభాభిషేకంలో పాల్గొన్న నూకతోటి రాజేష్, నాయకులు

నాగలాపురం: మండలంలోని ఎస్ఎస్.పురం గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ భవాని సమేత సదాశివేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కుంభాభిషేకాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ హాజరయ్యారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం కల్పించారు. కార్యక్రమంలో నాగలాపురం మండల అధ్యక్షుడు అపరంజిరాజు, సర్పంచ్ చిన్నదొరై సుధ, జేసీఎస్ కన్వీనర్ మోహన్ మొదలియార్, నాయకులు ఆనందయ్య, శేఖర్, ధనరాజ్, చిరంజీవి, ఉదయ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోరూ!

శ్రీకాళహస్తి: పట్టణంలో దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం బీజేపీ నాయకులు మున్సిపల్ కమిషనర్ గిరికుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ, పట్టణంలో దోమల బెడద రోజురోజుకూ తీవ్రమవుతోందని, చిన్నారుల నుంచి పెద్ద వరకు రోగాల బారిన పడి ఆస్పత్రులకు క్యూ కడుతున్నారని తెలిపారు. ప్రతి వీధిలో మందుల పిచికారీ చేయడం లేదని, మురుగు కాలువల్లో ఆయిల్‌బాల్స్ వేయకపోవడమే దీనిని కారణమని పేర్కొన్నారు. ఇకనైనా దోమల పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు హరీష్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు గరికపాటి రమేష్ బాబు, నాయకులు ఢిల్లీకుమార్, రాజ, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ వర్కర్ల ఆందోళన



సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

సత్యవేడు: అర్హులైన అంగన్‌వాడీ హెల్పర్లను వర్కర్లుగా ఉద్యోగోన్నతి కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్ డిమాండ్ చేశారు. ఆయన సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలన్నారు. పెండింగులో ఉన్న బిల్లులు, అద్దెలు చెల్లించాలన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ పంపిణీ చేయాలని కోరారు. వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నిర్మల, శాంతి, కాంతమ్మ, నాగరాజ, వనరాజ తదితరులు పాల్గొన్నారు.


రైల్వే ప్రయాణికులకు అవగాహన



ప్రయాణికులకు అవగాహన కల్పిస్తున్న జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): ఢిల్లీ రైల్వే స్టేషన్‌లో చోటుచేసుకున్న తొక్కిసలాటను దృష్టిలో ఉంచుకుని రేణిగుంట రైల్వే జంక్షన్‌లో సోమవారం రాత్రి ప్రయాణికులకు జీఆర్‌పీ, ఆర్పీఎఫ్ పోలీసులు అవగాహన కల్పించారు. రద్దీ అధికంగా ఉన్న సమయంలో ఎలా అప్రమత్తంగా వ్యవహరించాలనే అంశంపై సిబ్బందితో ద్వారా రోప్‌తో ట్రయల్ నిర్వహించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీఆర్‌పీ ఐఆర్ పి.యతేంద్ర, ఐపీఎఫ్ సందీప్, జీఆర్‌పీ ఎస్ఐ రవి, స్టేషన్ మాస్టర్ శేషగిరినాథరెడ్డి, ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



సత్యవేడు సీహెచ్‌సీలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

సత్యవేడు: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం మెరుగుపడుతుందని డాక్టర్ సురేష్ తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక కమ్యూనిటీ వైద్యశాల ఆవరణలో పారిశుద్ధ్య పనులు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్ల వినియోగం పర్యావరణానికి హాని కలిగిస్తుందన్నారు. పొడి-తడి చెత్త వేరుచేసి ప్లాస్టిక్ బుట్టలో వేయాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సోహెల్, హెడ్ నర్సు రమాదేవి, శానిటరీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న నూకతోటి రాజేష్

- హైకోర్టు ఉత్తర్వులను అమలు చేయాలి
- కాంట్రాక్టర్లకు ఇచ్చిన పనులు రద్దు చేయాలి
- వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజాప్రతినిధుల హక్కులను హరిస్తోందని వైఎస్సార్ సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆరోపించారు. ఆయన సోమవారం సర్పంచులు, ఎంపీటీసీలతో కలిసి పంచాయతీరాజ్ శాఖ సమస్యలపై తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామ పంచాయతీల్లో గ్రామసభ తీర్మానంతో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిబంధనలకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం కాంట్రాక్టర్లతో చేయిస్తోందని ఆరోపించారు. దీనిపై హైకోర్టుకు వెళ్లడంతో కాంట్రాక్టర్లకు అప్పగించిన ఉపాధి పనులను తక్షణమే రద్దు చేయాలని ఆదేశించిందన్నారు. సర్పంచుల పర్యవేక్షణలోనే ఉపాధి పనులు చేపట్టాలన్నారు. సర్పంచులు, ఎంపీటీసీల గౌరవానికి భంగం కలిగిస్తున్నారని దుయ్యబట్టారు. ఇలాంటి చర్యలు పునరావృతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. పార్టీ మండల కన్వీనర్లు నాయుడు దయాకర్‌రెడ్డి (వరదయ్యపాళెం), మణీనాయుడు (బీఎన్‌కండ్రిగ), సొరకాయలు (నారాయణవనం), జిల్లా ఉపాధ్యక్షుడు ధరణి ధనుంజయరెడ్డి, నారాయణవనం ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ బాబురెడ్డి, జిల్లా క్రియాశీలక కార్యదర్శి గోపాల్ రెడ్డి, నాయకులు ఉగుమూడి గురునాథం, పద్మనాభరెడ్డి, మధు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

క్రషర్‌కు తాగునీటిని సరఫరా చేయడంపై ఫిర్యాదు



తహసీల్దార్ సుబ్రమణ్యంకు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వేణుగోపాలపురం గ్రామ పంచాయతీలో సేలం గ్రామానికి పైపులైన్ ద్వారా వెళ్లే తాగునీటిని జీవీఆర్ క్రషర్‌కు ఇవ్వడంపై గ్రామస్తులు అభ్యంతరం తెలిపారు. వారు సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యంకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ సేలం గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయని తెలిపారు. గ్రామంలో నీరు లేకపోవడంతో కుమ్మారవెంకటాపురం గ్రామంలో బోరు వేసి పైపులైన్ ద్వారా నీటిని అందిస్తున్నారని తెలిపారు. జీవీఆర్ క్రషర్ మేనేజర్ దామోదర్‌రెడ్డి పంచాయతీ అనుమతి లేకుండా సేలం గ్రామం నుంచి జేసీబీతో రాత్రికిరాత్రే క్రషర్ వద్దకు పైపులైన్ వేసుకుని తాగునీటిని మళ్లించారని వాపోయారు. దీంతో నీరు చాలక తాము ఇబ్బంది పడుతున్నామని తెలిపారు. ఈ విషయాన్ని సంబంధితశాఖ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ సుబ్రమణ్యం మాట్లాడుతూ సమస్యను పరిష్కస్తానని హామీ ఇచ్చారు.

గ్రామస్తుల సహకారంతోనే పచ్చదనం



ర్యాలీలో పాల్గొన్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామస్తుల సహకారంతోనే గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత సాధ్యమని రిటైర్డ్ ఎస్పీ రమేషయ్య తెలిపారు. ఆయన సోమవారం తహసీల్దార్ సుబ్రమణ్యంతో కలిసి తన స్వగ్రామం చిన్నపాలేడులో స్వచ్ఛాంధ్రలో భాగంగా మొక్కలు నాటారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో శుభ్రం చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామస్తులందరూ కలిసి రూ.3 లక్షల వ్యయంతో మొక్కలు నాటడంతోపాటు పాఠశాల అభివృద్ధి పనులను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రాబోవు రోజుల్లో గ్రామంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అందుకు అధికారులు తమవంతు సహాయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో త్రివిక్రమ్‌రావు, ఎంఈవో రవీంద్రనాథ్, సర్పంచ్ రత్నమ్మ, ఏవో భారతి, ట్రాన్స్‌కో ఏఈ చలపతి, ఆర్ఐ నల్లయ్య, గ్రామస్తులు డాక్టరు వెంకటేశ్వర్లు, రాజేంద్ర, సుధాకర్‌నాయుడు, శేఖర్, సురేష్‌నాయుడు, విజయ్‌గోపాల్, మాజీ సర్పంచ్ సుధాకర్, కాశీబాబు, ప్రభాకర్, నాగరాజు, శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి నిజాయితీ



మహిళకు పర్సు అందజేస్తున్న మీర్జాన్ బాషా, ఏఎస్పీ

వరదయ్యపాళెం: తిరుపతిలో ఒక మహిళ ఆటోలో పోగొట్టుకున్న పర్సును వరదయ్యపాళెంకు చెందిన ఎస్‌కే మీర్జాన్ బాషా తిరిగి అందజేసి నిజాయితీని చాటుకున్నాడు. అతను సోమవారం వ్యక్తిగత పనుల నిమిత్తం తిరుపతి వెళ్లాడు. బస్టాండ్‌లో దిగి ఆటోలో మరో చోటుకు బయలుదేరాడు. అదే ఆటోలో బస్టాండ్ నుంచి విమల అనే మహిళ ప్రయాణించింది. మార్గమధ్యంలో దిగిపోయింది. ఆమె తన పర్సును ఆటోలోనే మరిచిపోయింది. గమనించిన ఎస్‌కే మీర్జాన్ బాషా దాన్ని పోలీసులకు అప్పగించాడు. పోలీసులు పర్సులో ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బాధితురాలికి సమాచారమిచ్చారు. ఆమె ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఏఎస్పీ కె.రవిమనోహరాచారి చేతుల మీదుగా యువకుడు మీర్జాన్ బాషా ఆమెఉ పర్సు అందజేశాడు. పర్సులో రూ.8500 నగదు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు ఉన్నట్లు బాధిత మహిళ తెలిపింది. యువకుడు మీర్జాన్ బాషాను ఏఎస్పీ అభినందించారు.

శివయ్యా..! ఫిర్యాదులకు దారేదయ్యా

-ముక్కంటి ఆలయంలో మూలన పడ్డ ఫిర్యాదుల పెట్టె



సీఆర్వో కార్యాలయంలో మూలన ఉన్న ఫిర్యాదుల పెట్టె

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మూడు నెలల క్రితం అప్పటి ఈఓ చంద్రశేఖర్ ఆజాద్ భక్తులు పడుతున్న ఇబ్బందులను, సమస్యలను తెలుసుకునేందుకు ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేశారు. దీనివల్ల మంచి ఫలితాలు కూడా వచ్చాయి. అయితే ఆయన బదిలీపై వెళ్లిన తరువాత ఆ ఫిర్యాదుల పెట్టెకు విలువ లేకుండా పోయింది. నూతనంగా ప్రారంభించిన సీఆర్వో, పీఆర్వో కార్యాలయంలో దానిని మూలన పడేశారు. ఆలయాల్లో పారదర్శక పాలన అందిస్తామని, భక్తులకు పెద్దపీట వేస్తామని కూటమి ప్రభుత్వం గొప్పలు చెప్పడం తప్పితే ఆచరణలో దీనికి భిన్నమైన పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. పేద, మధ్య తరగతి భక్తులకు అందుబాటులో ఫిర్యాదుల పెట్టెను ఉంచకుండా పీఆర్వో కార్యాలయంలో ఎవరికీ కనబడకుండా పెట్టడంపై సర్వత్రా విమర్శలు వస్తున్నాయి. రానున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో వివిధ చోట్ల నాలుగు ఫిర్యాదు పెట్టెలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

విభేదాలు వీడి అభివృద్ధి పనులు చేయండి



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

వరదయ్యపాళెం: నియోజకవర్గంలో నాయకులు, పార్టీ శ్రేణులు అంతర్గత విభేదాలు వీడి అభివృద్ధి వైపు అడుగులు వేయాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కూటమి నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఆయన సోమవారం కేవీబీపురం మండలం రాయపేడు గ్రామంలో బీసీకాలనీ నుంచి శ్మశానం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు.

బ్రహ్మోత్సవాలకు రండి..!

-న్యాయమూర్తులకు ఈఓ ఆహ్వానం



న్యాయమూర్తికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఈఓ

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి వచ్చే నెల 6వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్న నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్, సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కృష్ణప్రియను హాజరు కావాలని ఈఓ బాపిరెడ్డి ఆహ్వానపత్రికలు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

30 టన్నుల కూరగాయలు ఇస్తాం

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ మహాశివరాత్రి ఉత్సవాలకు 30 టన్నుల కూరగాయలను వితరణగా అందజేస్తానని నంద్యాలకు చెందిన కూరగాయల వ్యాపారి మార్కెట్ ప్రసాద్ తెలిపారు. 2006 నుంచి ప్రతి ఏటా ప్రముఖ శైవక్షేత్రాలకు కూరగాయలను అందజేస్తున్నట్లు చెప్పారు. 2006లో శ్రీకాళహస్తీశ్వరాలయానికి తొలుత రెండున్నర టన్నుల కూరగాయలు ఇచ్చానని నాటి నుంచి ప్రతి ఏటా ఇస్తున్నానని, ఈ ఏడాది ఉత్సవాలకు భారీగా వితరణ చేస్తున్నట్టు పేర్కొన్నారు.

హామీలు నెరవేర్చకుంటే ఉద్యమిస్తాం



ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు,త సీఐటీయూ నాయికులు

శ్రీకాళహస్తి: అంగన్‌వాడీ వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చకుంటే మరో చరిత్రాత్మక ఉద్యమం తప్పదని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. అంగన్‌వాడీలతో కలిసి సీఐటీయూ నాయకులు సోమవారం పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి కాలయాపన చేస్తోందని విమర్శించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలను రూ.26వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. రాబోవు బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీల వేతనాల పెంపుదల, ఇతర సమస్యల గురించి చర్చించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అంగేరి పుల్లయ్య, రేవతి, మల్లీశ్వరి, మాధవి, నాగరాజమ్మ, రాజా తదితరులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర, గోవా సీఎంలకు ఘన స్వాగతం



మహారాష్ట్ర సీఎంకు స్వాగతం పలుకుతున్న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్



గోవా సీఎంను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు కోలా ఆనంద్, సామంచి శ్రీనివాసులు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట విమానాశ్రయంలో మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు కలెక్టర్ వెంకటేశ్వర్, జిల్లా అధికార యంత్రాంగం సాదరంగా స్వాగతం పలికింది. అనంతరం ఆయన రోడ్డు మార్గాన తిరుమలకు పయనమయ్యారు. అలాగే తిరుపతి పర్యటన నిమిత్తం సోమవారం రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న గోవా ముఖ్యమంత్రి డాక్టర్ ప్రమోద్ సావంత్‌కి ఘన స్వాగతం లభించింది. తిరుపతి జిల్లా కలెక్టర్‌తో పాటు బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. జిల్లా కార్యదర్శి మేళగారం సుబ్రమణ్యంరెడ్డి, గిరిధర్‌సాయి, చైతన్య రాయల్, పేటసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

గైడ్ కెప్టెన్ శిక్షణ ప్రారంభం



శిక్షణ ఇస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తి: పట్టణంలోని సరస్వతిబాయి పురపాలక ఉన్నత పాఠశాలలో సోమవారం స్కౌట్స్ అండ్ గైడ్స్ తిరుపతి జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో గైడ్ కెప్టెన్ బేసిక్ శిక్షణ ప్రారంభమైంది. జిల్లా విద్యాశాఖాధికారి కేవీఎన్ కుమార్ ఆదేశాల మేరకు ఈ నెల 23వ తేదీ వరకు ఈ శిక్షణ ఇస్తున్నట్టు అధికారులు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 42మంది మహిళా ఉపాధ్యాయులు, పీఈటీలు హాజరయ్యారు. శిక్షకులుగా శకుంతలమ్మ, జిల్లా కార్యదర్శి జయరామ్, జిల్లా కార్యాలయ కమిషనర్ రమేష్‌బాబు, కోటేశ్వరరావు, సతీసావిత్రి, పార్వతి, అజారుద్దీన్, హేమకుమార్ వ్యవహరించారు.

సత్యవేడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజశేఖర్

సత్యవేడు: సత్యవేడు ఇన్‌చార్జి తహసీల్దార్‌గా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న టీవీ సుబ్రమణ్యం డిప్యుటేషన్‌పై తిరుపతి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ క్రమంలో వరదయ్యపాలెం తహసీల్దార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపాధిపై కూటమి నేతల ప్రమేయంపై ఫిర్యాదు



డీఆర్వోకు ఫిర్యాదు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ : ఉపాధి హామీ పనుల్లో కూటమి నేతల ప్రమేయంపై సోమవారం బీఎన్‌కండ్రిగ, వరదయ్యపాళెం, నారాయణవనం మండలాలకు చెందిన ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డీఆర్‌వో నరసింహులుకు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ కూటమి నేతలు ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుతున్నారని తెలిపారు. గ్రామ సభల తీర్మానం, స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులతో నిమిత్తం లేకుండా ఇష్టారీతిన పనులను కాంట్రాక్టర్లకు అప్పగిస్తున్నారని తెలిపారు. యంత్రాలతో పనులను చేయిస్తున్నారని ఆరోపించారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించగా ఉపాధి చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని, పనులను వెంటనే రద్దు చేయాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. డ్వామా పీడీ, జెడ్పీ సీఈవో, ఎంపీడీవో, పీవో, ఏపీవోలు జరుగుతున్న అవకతవకలకు బాధ్యత వహించాల్సి వస్తుందని, చట్టం ఉల్లంఘించిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు మణినాయుడు, దయాకర్‌రెడ్డి, సొరకాయలు, నారాయణవనం ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ధనంజయులురెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, గురునాథం, పద్మనాభరెడ్డి, గురవయ్య, ప్రసాద్‌పాల్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి



పెద్దపాలేడులో ఆన్‌లైన్‌లో రైతుల వివరాలను నమోదు చేస్తున్న ఏవో భారతి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ప్రతి రైతుకూ విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరని, అందరూ పేర్లు నమోదు చేసుకోవాలని ఏవో భారతి తెలిపారు. ఆమె సోమవారం ఆలత్తూరు, తలారి వెట్టు, కల్లివెట్టు, నీర్పాకోట, కనమనంబేడు, పెద్దపాలేడు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి విశిష్ట గుర్తింపు సంఖ్యపై అవగాహన కల్పించారు. రైతుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆమె మాట్లాడుతూ రైతులు వారి ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నంబర్, పాస్‌బుక్, తీసుకుని రైతు భరోసా కేంద్రంలో వీఏఏ ద్వారా వివరాలు నమోదు చేయించాలన్నారు. వారికి ప్రత్యేక గుర్తింపు సంఖ్య వస్తుందని, దానితోనే రాబోవు రోజుల్లో ప్రభుత్వ పథకాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో వీఆర్వోలు భాస్కర్, జగదీష్, బాలమురళీకృష్ణ, ఏఈవో రేవతి, వీఏఏ లావణ్య, భారత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న యాసిన్

శ్రీకాళహస్తి: పట్టణంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఐక్యూసీ, శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం డిస్ట్రిక్ మెంటల్ హెల్త్ పోగ్రాం నిర్వహించారు. జిల్లా మెంటల్ హెల్త్ మోడల్ ఆఫీసర్ డాక్టర్ యాసిన్ మాట్లాడారు. విద్యార్థులకు ఎదుర్కొనే ఒత్తిళ్లు, వాటి కారణాలు, నివారణ చర్యలను వివరించారు. ఒత్తిడికి గురైన వారు టోల్‌ఫ్రీ నంబర్ 14416ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ విజయలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ దీనదయాల్ తదితరులు పాల్గొన్నారు.